సాక్షి కర్నూలు

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



యూరియా పంపిణీలో విఫలం

రైతులకు యూరియాను అందించడంలో అధికారులు విఫలమయ్యారని జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



అడుగులన్నీ శ్రీగిరి వైపు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు శ్రీశైలం వైపు అడుగులు వేస్తున్నారు. నల్లమల అటవీ మీదుగా 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,610.25
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:38,076
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,115

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): గ్రూపు–2 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 23వ తేదీన జిల్లాలో 30 కేంద్రాల్లో నిర్వహించనున్నారని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ తెలిపారు. జిల్లాలో మొత్తం 9,993 మంది పరీక్షలు రాయనున్నారని, వారి సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సందేహాలు ఉంటే 08518–277305 నంబర్‌కు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గ్రూపు–2 మెయిన్స్ పరీక్షలపై అధికారులతో గురువారం ఆమె సమీక్షించారు. పరీక్షలు రాసే వారు సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నిర్దేశిత సమయం కంటే నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోరని పేర్కొన్నారు. టౌన్ డీఎస్పీ బాబుప్రసాదు, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వి.బాబురావు, సెక్షన్ ఆఫీసర్లు బ్రహ్మేశ్వరరావు, సుధాకర్‌బాబు, ఏఎస్ఓలు కేఎస్ఎస్ అనిల్‌కుమార్, టి.ఆంజనేయులు, యోగేష్ పాల్గొన్నారు.

మిర్చి ధర పతనం

- క్వింటా రూ.9,500 మాత్రమే

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి క్వింటా ధర రూ.20 వేలు లభిస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. అయితే సగం ధర కూడా రైతుకు దక్కడం లేదు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 804 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాకు సగటున రూ.9,500 ధర మాత్రమే లభించింది. ఈ ఏడాది జిల్లాలో 95,477 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. ప్రకృతి సహకరించకపోవడంతో దిగుబడులు 50 శాతం వరకు తగ్గిపోయాయి. గత నాలుగైదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ధరలు కూడా పడిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ప్రతి రోజు ప్రత్యేక తరగతులు

ఆలూరు రూరల్: బీసీ హాస్టళ్లలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆలూరులోని బీసీ బాలికల, బాలుర హాస్టళ్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతిలో, ఇంటర్‌లో హాస్టల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని వార్డెన్లను ఆదేశించారు. సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారి కుళ్లాయప్ప, వార్డెన్లు షాహినూర్, సంపత్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



క్యూలైన్లను పరిశీలిస్తున్న రాష్ట్ర దేవదాయశాఖ కార్యదర్శి వినయ్ చంద్

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను గురువారం రాష్ట్ర దేవదాయశాఖ కార్యదర్శి వాడరేవు వినయ్ చంద్ పరిశీలించారు. సర్వదర్శనం, శీఘ్ర, అతి శీఘ్రదర్శన క్యూలైన్లు, పాగాలంకరణ, కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూలైన్ల నిర్వహణ పూర్తి ప్రణాళికబద్ధంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారులు నిరంతరం క్యూలైన్ల నిర్వహణను పరిశీలిస్తుండాలన్నారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. క్యూకాంప్లెక్స్‌లో ప్రత్యేకంగా ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, దేవస్థానం ఎం.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.59.87 లక్షలు

మహానంది: మహానందీశ్వరుడికి హుండీ ఆదాయం రూ.59.87 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానందిలోని అభిషేకం మండపంలో గురువారం శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండ రామాలయం, వినాయక నంది ఆలయాల హుండీలతో పాటు అన్నదాత విభాగం, గోసంరక్షణ విభాగం హుండీ కానుకలను లెక్కించారు. ఆలయాల హుండీల ద్వారా రూ.58,56,681 రాగా అన్నప్రసాదం ద్వారా రూ.99,110, గోసంరక్షణ విభాగం ద్వారా రూ.31,317 వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓ మధు, సూపరింటెండెంట్ శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంపాలు

అనంతపురం జిల్లాలో పాల కల్తీ వ్యవహారం ఆ ప్రాంతాన్నే కాదు మొత్తం రాష్ట్రంలో కలకలం రేపింది. తాగుతున్న పాలు స్వచ్ఛమైనవేనా అనే సందేహం ఇప్పుడు ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతోంది. గ్రామాల్లో పశువులు గణనీయంగా తగ్గిపోవడంతో పాల ఉత్పత్తి కూడా అదే స్థాయిలో పడిపోతోంది. ఈ నేపథ్యంలో ప్యాకెట్ పాలు మార్కెట్‌ను ముంచెత్తుతుండటంతో కల్తీ అధికమైంది. పాలు చిక్కగా ఉండేందుకు.. వెన్న శాతం పెరిగేందుకు అనారోగ్యకరమైన పద్ధతులు తెరపైకి వస్తుండటంతో ఆందోళన కలిగిస్తోంది.

ఉమ్మడి జిల్లా జనాభా:	50లక్షల పైనే
అవసరమైన పాలు:	16లక్షల లీటర్లు
జిల్లాలో ఉత్పత్తి:	10,82,950 లీటర్లు

అనంతపురం జిల్లాలో వెలుగుచూసిన కల్తీ ఇలా..

- కొంతమేర మాల్టోటెక్స్టిన్ పౌడర్, పామాయిల్ 250/500 ఎంఎల్, లీటరు పలుచని పాలు, ఉప్పు తీసుకొని మిక్సీకి వేస్తారు. ఇలా చేయడం వల్ల చిక్కటి లిక్విడ్ వస్తుంది.
- దీనిని ప్రతి 20 లీటర్ల పాలకు అర్ధలీటరు లిక్విడ్‌ను కలిపి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు.
- ఇందువల్ల పాలు చిక్కగా ఉంటాయి. వెన్న శాతం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది.
- ఈ కల్తీని లాక్టోమీటరు కూడా గుర్తించలేకపోవడం గమనార్హం.

కలకలం రేపుతున్న పాల కల్తీ

- గత ఏడాది 12 శాంపిల్స్‌లో ఐదింట నిర్ధారణ
- చిక్కదనం, వెన్న శాతం పెంపునకు అడ్డదారులు
- డిమాండ్‌కు తగినట్లుగా లేని పాల ఉత్పత్తి
- కొరతను అధిగమించేందుకు కల్తీ చేస్తున్న వ్యాపారులు
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం



ఎలాంటి వివరాలు లేకుండా పాల ప్యాకెట్ల తయారీని చూపుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్(ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో 2,16,590 పశువుల నుంచి రోజు పాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఆవులు, బర్రెలు రోజుకు సగటున 5 లీటర్ల వరకు పాలు ఇస్తాయి. ఈ ప్రకారం రోజుకు 10.82 లక్షల లీటర్లు మాత్రమే పాల ఉత్పత్తి ఉంటోంది. దీన్ని బట్టి చూస్తే రోజుకు 5.17 లక్షల లీటర్ల పాల కొరత ఉందన్నది వాస్తవం. ఈ కొరతను అధిగమించేందుకు కొన్ని డెయిరీలు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం, ఉన్న పాలనే కల్తీ చేస్తున్నట్లు సమాచారం. కొన్ని డెయిరీలు పాలు ఎక్కువగా ఉన్నప్పుడు పాలను పాడిగా తయారు చేసుకుంటాయి. కొరత ఉన్నప్పుడు పాడిని ఉపయోగించి పాలుగా మార్పు చేసి కొరతను అధిగమిస్తున్నారు. పాలు ఉత్పత్తి చేసే నిజమైన రైతు లీటరు మీద పొందుతున్న లాభం రెండు, మూడు రూపాయలే. వీటిని కొంటున్న వ్యాపారులు కొందరు కల్తీ చేయడం ద్వారా లీటరుకు రూ.10పైగా లాభం పొందుతున్నారు. పశువుల సంఖ్య పడిపోవడంతో డిమాండ్‌కు తగ్గట్టుగా పాల ఉత్పత్తి కరువైంది. కల్తీ చేయడం ద్వారానే డిమాండ్‌కు తగ్గట్టుగా పాలు మార్కెట్‌లో లభిస్తున్నాయని తెలుస్తోంది. కల్తీ పాలు తాగుతుండటం వల్లే అధిక శాతం ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తాగుతున్న పాలు స్వచ్ఛమైనవేనా?

జిల్లాలో విజయ పాలు, పలు ప్రయివేటు డెయిరీల పాల విక్రయాలు చేపడుతున్నాయి. కొంత మంది రైతుల నుంచి పాలు సేకరించి వాటిని కల్తీ చేసి ఇటు డెయిరీలకు, అటు వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరుగుతున్న పాల కల్తీ ఉలిక్కిపడేలా చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా వివిధ రూపాల్లో పాలు కల్తీ అవుతున్నాయనే చర్చ జరుగుతోంది. పాలల్లో నీరు కలిపి కల్తీ చేయడం కొత్తేమీ కాదు. అయితే కొంత మంది వ్యాపారులు, దళారీలు ఎక్కువ లాభం పొందేందుకు పాలల్లో నీళ్లే కాకుండా అనేక రసాయనాలను కలుపుతున్నట్లు సమాచారం. కెమికల్స్‌తో పాల నాణ్యత పరిమాణాన్ని కృత్రిమంగా పెంచేస్తున్నారు. నీళ్లు, డిటర్జెంటు, మొక్కజొన్న పిండి, యూరియా, పొద్దుతిరుగుడు నూనె వంటి వాటిని వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండటానికి ఫార్మాలిన్ లేదా బోరిక్ యాసిడ్, చిక్కగా ఉండటానికి క్లోరిన్, అమ్మోనియా సల్ఫేటు కలుపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కాస్టిక్ సోడా, బెంజాయిక్ యాసిడ్, సాలిసిలిక్ యాసిడ్ కలుపుతున్నట్లు సమాచారం.

శాంపిల్స్ తీస్తున్నాం



అనంతపురం జిల్లాలో పాల కల్తీ వెలుగులోకి వచ్చిన వెంటనే ఇక్కడ కూడా విజిలెన్స్ అధికారులతో కలసి నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలో శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపాం. ఫలితం వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటాం. టార్గెట్ ప్రకారం పాలు, పాల పదార్థాల శాంపిల్స్ తీసి ల్యాబ్‌లకు పంపుతున్నాం. ఈ ఏడాది మరిన్ని శాంపిల్స్ సేకరిస్తాం. – **కూర్మనాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి కర్నూలు జిల్లా**

గత ఏడాది ఐదు కల్తీ కేసులు

2024లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి 12 శాంపుల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఐదింట్లో కల్తీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇవన్నీ మార్కెట్‌లోకి వెళ్లిపోయాయి. కల్తీతో ప్రజారోగ్యం ఏ స్థాయిలో దెబ్బతింటుందో ఊహించుకోవచ్చు. 2024లో కర్నూలులో మార్కెట్ షేర్ ఎక్కువగా ఉన్న డెయిరీ దూద్‌పేడాలో కల్తీ జరిగినట్లు తేలింది. పాలు, కలాకాన్, నెయ్యి వంటి వాటిల్లో కల్తీ ఉన్నట్లు నిర్ధారణ కావడం గమనార్హం. కల్తీపై జేసీ కోర్టులో ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసులు నమోదు చేశారు.

‘జీబీ సిండ్రోమ్’పై అప్రమత్తం

- పెద్దాసుపత్రిలో అవసరమైన ఏర్పాట్లు
- సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె. వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): గులియన్ బారే సింద్రోమ్(జీబీ సింద్రోమ్) అనే వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆసుపత్రిలోని తన చాంబర్‌లో వైద్యులతో గురువారం సమీక్ష నిర్వహించారు. వ్యాధికి సంబంధించి లక్షణాలపై చర్చించారు. రోగులకు అందుతున్న చికిత్స, ఇతర అంశాల గురించి తెలుసుకున్నారు. కాళ్లు, చేతులు స్పర్శ కోల్పోయినట్లు అనిపిస్తే వెంటనే ఆసుపత్రికి రావాలని ప్రజలకు సూచించారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపైనే తీవ్ర ప్రభావం చూపిస్తుందని, సకాలంలో వైద్యం అందితే ముప్పు ఉండదన్నారు. చికిత్సకు అవసరమైన ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉందని తెలిపారు. ఈ వ్యాధికి సంబంధించి నోడల్ అధికారిగా డాక్టర్ దమామ్ శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ, హెచ్‌వోడీలు డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ సి. శ్రీనివాసులు, పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 69 కేంద్రాలు

- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, జిల్లాలో 69 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గురువారం సాయంత్రం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు 23,098 మంది, రెండో సంవత్సర విద్యార్థులు 22,227 మంది పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ప్రశ్న పత్రాల భద్రతకు పటిష్ట ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూయించాలని, అలాగే 144 సెక్షన్ విధించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ, డీఆర్వో, ఆర్ఐఓ పాల్గొన్నారు.

కార్మికులకు ‘ఈ శ్రమ్’ భద్రత

ఈ శ్రమ్ కార్డుతో అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లాలోని అసంఘటితరంగ కార్మికులను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ శ్రమ్‌లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన కింద రూ.2లక్షల బీమా ఉచితంగా లభిస్తుందన్నారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించాలని కార్మిక శాఖ కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఆదేశాలు ఇచ్చారు.

మార్చి 15 వరకు ఎంఎస్ఎంఈ సర్వే

జిల్లాలో మార్చి 15వ తేదీ వరకు నిర్వహించే ఎంఎస్ఎంఈ సర్వేకు పరిశ్రమల యజమానులు సహకరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సర్వే ద్వారా పరిశ్రమల వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తారన్నారు.

కొనసాగుతున్న పీ4 సర్వే

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 సర్వే జిల్లాలో కొనసాగుతుంతోందని సీఎస్ విజయానంద్‌కు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వివరించారు. పీ4 సర్వే ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభమైందని, మార్చి 2వ తేదీ ముస్తుందని తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం వివిధ అంశాలపై సీఎస్ సమీక్షించారు. జిల్లాలో గ్రూపు–2 మెయిన్స్, ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం తీసుకున్న చర్యలను సీఎస్‌కు జిల్లా కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వోసి.వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

భృంగి వాహనాధీశా.. పాహిమాం

- శ్రీగిరిలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- భృంగివాహనంపై ఆదిదంపతుల విహారం
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తరించిన భక్తజనం
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన



భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల శోభతో శ్రీగిరి క్షేత్రం ఇల కైలాసాన్ని తలపిస్తోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు భృంగి వాహనంపై దర్శనమిచ్చారు. భక్తుల శివనామస్మరణతో, కళాకారుల సందడితో పరమేశ్వరుడి పరమభక్తుడైన భృంగి పులకించిపోయారు. వేలాది మంది భక్తులు భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్ల దివ్యమంగళస్వరూపాన్ని దర్శించి దీవెనలిమ్మని వేడుకున్నారు. ఉత్సవంలో ముందుగా భృంగి వాహనాన్ని వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించారు. అలంకార మండపంలో స్వామిఅమ్మవారల ఉత్సవమూర్తులను భృంగి వాహనంపై ఉంచి అర్చకులు, వేదపండితులు వేద మంత్రోచ్చారణతో ప్రత్యేక పూజా హారతులిచ్చారు. అనంతరం భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను గ్రామోత్సవాన్ని దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. పరివార దేవతామూర్తులకు కర్పూర నీరాజనాలు సమర్పించుకుంటూ ఉత్సవాన్ని ఆలయం బయటకు తీసుకొచ్చారు. ఉత్సవం ముందు పలువురు కళాకారుల నృత్యాలు, కోలాటం, నాదస్వరం, చెక్కభజనలు, రాజభటుల వేషధారణలు, కేరళ చండీమేళం, కొమ్ము కొయ్యనృత్యం, డప్పుల నృత్యాలు, బుట్టబొమ్మలు, నందికోలసేవ భక్తులను అలరించాయి. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు శోభాయమానంగా సాగింది.



కళాకారుల నృత్య ప్రదర్శన

శ్రీశైలంలో నేడు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు శుక్రవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు హంస వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం ఆలయ పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు. విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ఇవ్వాలి

కర్నూలు(అగ్రికల్చర్): పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయడంలో ఆలస్యమైందని, ఉద్యోగులకు వెంటనే మధ్యంతర భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి కోరారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం కర్నూలులోని ఎన్‌జీవో హోంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను తక్షణం విడుదల చేయాలన్నారు. సంఘం వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్, కోశాధికారి భాస్కరనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, రమణలను సస్పెండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి విధులన్నీ కేసీహెచ్ కృష్ణుడు నిర్వహిస్తారని ప్రకటించారు. రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నాయకులు ఎంసీ కాశన్న, రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

రైతుల ఆవేదన పట్టదా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పంటలకు గిట్టుబాటు ధర కల్పించరా?
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పట్టదా అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుల ఇబ్బందులపై తన స్వగృహంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి టీడీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. గుంటూరు మిర్చి మార్కెట్‌లో రైతులు గిట్టుబాటు ధరరాక పడుతున్న బాధలను చూసి వారితో మాట్లాడటానికి వెళ్లిన వైఎస్ జగన్‌పై కేసు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పంటల దిగుబడులు కొనుగోలు చేయాలి

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడామని, పసుపు, మిర్చి, ఉల్లితో పాటు మొత్తం 24 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో గతేడాది మిర్చి క్వింటా ధర రూ.21వేల నుంచి 22వేల వరకు లభించిందన్నారు. ప్రస్తుతం క్వింటాళ్ల రూ. 8వేల నుంచి 11వేలకు పడిపోయిందన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తెగుళ్ల కారణంగా పంట దిగుబడులు తగ్గాయన్నారు. ఎకరాకు 10 క్వింటాళ్లు మించి రాలేదని, పెట్టుబడి ఖర్చులు చూస్తే ఎకరాకు సుమారుగా రూ. 1.50 లక్షలు అవుతుందన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. రైతులు ఇంత ఇబ్బందులు పడుతున్నా ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తరఫున రైతులను పలకరించే వారు లేరన్నారు. వెంటనే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకోవాలన్నారు.

అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

రాష్ట్ర ప్రజల తరఫున పోరాటం చేయడానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నారని కాటసాని అన్నారు. జిల్లాల్లో పర్యటనలు చేస్తున్న జగన్‌కు కూటమి ప్రభుత్వం సెక్యూరిటీ ఇవ్వలేకపోతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలే జగన్‌కు రక్షణగా ఉంటారన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ‘సూపర్ సిక్స్’ హామీలు అమలు చేయడం లేదన్నారు. అధికారంలోకి వస్తే సరసమైన ధరలకే నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి రేట్లు పెంచారన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరెడ్డి, నాగ లక్ష్మిరెడ్డి, సాన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మిరప.. విలపిం‘చేను’

ఆరుగాలం కష్టించి పండించిన మిరప పంటకు మార్కెట్‌లో ధర లేదు. దీంతో చాలా మంది రైతులు మిరప పొలాలను వదిలేశారు. అందులో పశువులను వదులుతున్నారు. చిప్పగిరి మండలం కుందనగుర్తి సమీప పొలంలో గురువారం మిరప చేనులో పశువులు మేస్తున్న దృశ్యం కనిపించింది. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి చిప్పగిరి మండలంలోని 4,000 ఎకరాల్లో మిరప సాగు చేశారు. గతేడాది క్వింటా మిర్చి ధర రూ. 70,000 వరకు పలకగా.. ఈ ఏడాది రూ. 20,000 కూడా దాటలేదు. దీంతో చాలా మంది పంటను పొలాల్లోనే వదిలేశారు.

– చిప్పగిరి

క్లుప్తంగా

కుక్కల దాడిలో 15 గొర్రెల మృతి

తుగ్గలి: కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రెలు మృతి చెందగా.. మరో 15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన జొన్నగిరి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రైతు ఉల్లాల అంజినయ్య షెడ్‌లో గొర్రెలు ఉంచగా కుక్కలు ప్రవేశించి దాడి చేశాయి. తనకు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.

నాపరాతి గని గుంతలో పడి వృద్ధుడి మృతి

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెకు చెందిన వృద్ధుడు మంజుల బొజ్జన్న(72) గని గుంతలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఐదు రోజుల క్రితం బొజ్జన్న చింతలాయిపల్లె రోడ్డులో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ కనిపించలేదు. గురువారం గనుల సమీపంలో గొర్రెలు కాపారులు వ్యక్తి మృతదేహాన్ని గుర్తించడంతో వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి గ్రామంలో విచారించారు. చనిపోయినది బొజ్జన్నగా అతని కుటుంబీకులు గుర్తించారు. మద్యం తీసుకొని ఇంటికెళ్తూ మార్గమధ్యలో నాపరాతి గని రాళ్లగుట్ట వద్ద కాలుజారి గని గుంతలో పడి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఆత్మకూరురూరల్: నల్లకాల్వ సమీపంలోని వైఎస్సార్ స్మృతి వనం వద్ద ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిడుతూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన జూపల్లి బాలన్న (65) గురువారం స్మృతివనం ప్రహరీకి తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. సెక్యూరిటీ సిబ్బంది గమనించి ఆత్మకూరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ నారాయణ రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహం ఫొటోను పోలీసు, మీడియా వాట్సప్ గ్రూపుల్లో ఉంచడంతో చివరకు ఆచూకీ లభించింది. కుటుంబీకులు గుర్తించి ఆత్మకూరు చేరుకున్నట్లు సీఐ రాము తెలిపారు. వృద్ధుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- డ్రైవర్ సురక్షితం



ఎస్సార్బీసీ కాల్వలో పడిన ట్రాక్టర్


పాణ్యం: ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ కాల్వలో దూసుకెళ్లింది. ట్రాక్టర్‌లో నుంచి దూకి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. మండల కేంద్రమైన పాణ్యం సమీపంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారి మరమ్మతుల కారణంగా వన్‌వేను ఏర్పాటు చేశారు. ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలపై ఉన్న బ్రిడ్జి ఇరుకుగా ఉంది. ఈ బ్రిడ్జిపైనే వన్‌వే ఏర్పాటు చేశారు. పాణ్యం గ్రామానికి చెందిన నడిపెన్న ట్రాక్టర్‌ను ఈ తోవలోనే తోలుతున్నాడు. ప్రమాదశాత్తు ట్రాక్టర్ కాల్వలోకి దూసుకెళ్లగా ఆయన కిందకు దూకడంతో ఎలాంటి గాయాలు కాలేదు.



అడుగులన్నీ శ్రీగిరి వైపు..

- నల్లమల మీదుగా పాదయాత్రగా మల్లన్న చెంతకు భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఓం హరోం హరా.. శంభో శంకరా.. ఓం నమఃశివాయ.. అంటూ భక్తుల శివనామస్మరణతో నల్లమల గిరులు మారుమోగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మల్లన్న చెంతకు పాదయాత్రగా భక్తులు చేరుకుంటున్నారు. పలువురు శివస్వాములు, సాధారణ భక్తులు నల్లమల మీదుగా శ్రీగిరికి వస్తున్నారు. ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర గోసాయికట్ట, వీరాంజనేయస్వామి గుడి, నాగలూటి వీరభద్రస్వామి దేవాలయం, దామెర్ల కుంట, పెచ్చెరువు, మఠం బావి, భీమునికొలను, కైలాసద్వారం చేరుకుంటున్నారు. అక్కడి నుంచి హఠకేశ్వరం, సాక్షిగణపతి మీదుగా శ్రీశైలం చేరుకుని మల్లన్నను దర్శించుకుంటున్నారు. నల్లమలలో ఎత్తైన కొండలు, గుట్టలు, వాగులు, వంకల్లో నడుచుకుంటూ వృద్ధులు, మహిళలు దాదాపు 40 కిలోమీటర్లు పాదయాత్రగా శ్రీశైలం వైపు అడుగులు వేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మరో వైపు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా వాహనాల్లో శ్రీశైలానికి తరలివస్తున్నారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఉచిత, రూ.200, రూ.500 క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి, నిర్దిష్ట వేళలలో మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పించారు.



ఆలయంలో పుష్పాలంకరణ



నల్లమలలో పాదయాత్రగా వస్తూ..



కైలాసద్వారం వద్దకు చేరుకున్న భక్తులు



మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

యూరియా పంపిణీలో విఫలం

- నంద్యాల వ్యవసాయ అధికారులపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం
- మిర్చి ధరల పతనంపై సుదీర్ఘ చర్చ
- ఆరోగ్యశ్రీలో భారీగా అక్రమాలు: ఎమ్మెల్యే పార్థసారథి
- హుందాగా సాగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు





సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, హాజరైన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లాలో రబీ రైతులకు యూరియాను అందించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమయ్యారని జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జెడ్పీలో స్థాయీ సంఘ సమావేశాలు హుందాగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్ని విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో ఎంతో పారదర్శకంగా పంపిణీ అయ్యేవని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతు అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేయలేక పోవడంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జనవరి నెల నుంచి యూరియాకు సంబంధించిన వరుస కథనాలు పత్రికల్లో ప్రచురితమవుతున్నా .. ఎందుకు చర్యలు చేపట్టలేక పోతున్నారని నంద్యాల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణపై జెడ్పీ చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వరి సాగు పెరిగిందని, సాధారణ సాగు 27 వేల హెక్టార్లు కాగా, ఈ ఏడాది సాగు విస్తీర్ణం 37 వేలకు పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారి ఇచ్చిన సమాధానంపై చైర్మన్ పాపిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా ముందుగానే యూరియాను ఎందుకు తెప్పించలేక పోయారని అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌బీకేల ద్వారా ఒక బస్తాను రూ.267కు అందించాల్సి ఉండగా, బయటి మార్కెట్‌లో రైతులు ఒక బస్తా యూరియాను రూ.350 నుంచి రూ.400 పెట్టి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇందుకు బాధ్యులెవరని ఆయన ప్రశ్నించారు.

మిర్చి ధరల పతనంపై సుదీర్ఘ చర్చ

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో రాష్ట్రంలో మిర్చి ధరలు పతనం కావడంపై సుదీర్ఘ చర్చ జరిపారు. జిల్లాలో సాధారణంగా 95 వేల నుంచి ఒక లక్ష ఎకరాల వరకు మిర్చి పంటను వేసేవారని, గత ఏడాది ధరలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది 1.43 లక్షల ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారని హార్టికల్చర్ అధికారిణి సమాధానం ఇచ్చారు. గతేడాది ఒక క్వింటాలు రూ.23 వేల వరకు ధర పలికిందని, ఈ ఏడాది ఒక క్వింటాలు రూ.11 వేలు కూడా లేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్యాపిలి జెడ్పీటీసీ బీ శ్రీరాంరెడ్డి తెలిపారు. అధికారుల సలహాల మేరకు వాడిన మందులతో తెగుళ్లు కూడా కంట్రోల్ కావడం లేదన్నారు. ధరలు పతనమైన నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ఏమి చేస్తే బాగుంటుందో తెలియజేయాలని ఆదోని ఎమ్మెల్యే బీ పార్థసారథి కోరారు. ఎకరాకు రూ.10 వేలు నష్ట పరిహారం అందించే ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఆరోగ్యశ్రీలో భారీగా అక్రమాలు

పేదలకు అందించే వైద్యానికి సంబంధించి ఆరోగ్యశ్రీలో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ బీ పార్థసారథి ఆరోపించారు. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వం, నిరక్షరాస్యత, వ్యాధి తీవ్రతను ఆసరాగా చేసుకొని పలు ఆసుపత్రులు కోట్ల రూపాయాలను అక్రమంగా ఆర్జిస్తున్నాయన్నారు. గత ఆరు నెలలుగా జిల్లాకు రూ.118 కోట్లు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం నుంచి బిల్లుల రూపంలో విడుదలయ్యాయని, ఇంతకు రెండింతలు పలు ఆసుపత్రులు ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేసి ఉంటాయన్నారు. ఆరోగ్యశ్రీపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య శాఖకు చెందిన అధికారులపై ఉందన్నారు. ఏ మేరకు అవగాహన కల్పించారనే విషయాన్ని వచ్చే సమావేశంలో తనకు సమాధానం చెప్పాలన్నారు. అలాగే జిల్లాకు సంబంధించిన అనేక మంది మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, హైదరాబాద్‌లో ఆరోగ్యశ్రీపై వైద్యం చేసే ఆసుపత్రులకు సంబంధించి కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నాపరాయి పరిశ్రమలను ఆదుకోవాలి

జిల్లాలో మానవీయ కోణంలో నాపరాయి పరిశ్రమలను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి కోరారు. మేజర్ మినరల్స్‌ను దృష్టిలో ఉంచుకొని ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న నాపరాయి పరిశ్రమలపై విజిలెన్స్ దాడులు చేయడం శోచనీయమన్నారు. ఈ పరిశ్రమలకు రాయల్టీ ఫీజును కూడా తొలగించాలని, కేవలం ఉపాధి రంగంగా చూస్తు అవసరమైన మేర ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలు విజయవంతం అయ్యేందుకు బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నీటి పారుదల, తాగునీరు, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, స్త్రీ శిశు సంక్షేమం, గృహ నిర్మాణం, డ్వామా తదితర ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలు హాజరయ్యారు.

రేపు జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జిల్లా టీ-20 క్రికెట్ జట్టును శనివారం ఎంపిక చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు అద్వైత్, ఉసేన్‌వలి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. టీ-20 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-16, అండర్-19, సీనియర్స్ విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. క్రీడాకారులు ఇతర వివరాలకు 8464942920, 9701515415 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దు

- రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకుల డిమాండ్



పోస్టర్లు విడుదల చేస్తున్న రాయలసీమ అభివృద్ధి వేదిక నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని, అమరావతికి తరలించొద్దని రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏపీజీబీ రీజినల్ కార్యాలయం దగ్గర వాల్ పోస్టర్లను ఆ వేదిక నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌శర్మ, నాగరాజు, భాస్కరరెడ్డి, సునయ్‌కుమార్, జంద్యాల రఘుబాబు, అంజిబాబు మాట్లాడుతూ.. కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు, అది అక్కడే ఉంటే రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. ఆర్థిక శాఖ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కూలీల కష్టం దగ్ధం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో ఉచ్చీరప్ప, అతని భార్య కూలి పనిచేసి సంపాదించినంతా అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. కూడపెట్టుకున్న డబ్బు, బంగారం, మోటార్ సైకిల్ అగ్నికి ఆహుతయ్యాయి. ఆ కుటుంబ పరిస్థితి చూసి గ్రామస్తులు అయ్యో పాపం అంటున్నారు. గత 15 రోజుల క్రితం బిల్లేకల్లు గ్రామంలోని గుడిసెకు తాళం వేసి ఉచ్చీరప్ప, అతని భార్య, కుమార్తె గుంటూరు దగ్గర మిర్చి కోతకు వలస వెళ్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె నుంచి గురువారం మంటలు చెలరేగడంతో సమీపంలోని వారు గుర్తించారు. మంటల్లో మూడు తులాల బంగారం, రూ.50వేలు నగదు, ఒక మోటార్ సైకిల్, దుస్తులు, గింజలు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మంటలను ఆర్పివేశారు. నష్టపోయిన బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలి గ్రామస్తులు కోరుతున్నారు.



బిల్లేకల్లులో దగ్ధమవుతున్న గుడిసె

డిగ్రీ మొదటి సెమిస్టర్‌లో 3,115 మంది ఉత్తీర్ణత

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2024 అక్టోబర్ నెలలో నిర్వహించిన బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 3,310 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,115 మంది ఉత్తీర్ణత సాధించగా 195 మంది ఫెయిల్ అయ్యారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in అందుబాటులో ఉన్నాయని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్‌ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

బస్సులో బంగారు నగలు చోరీ

మహానంది: నంద్యాల నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా 13 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. గురువారం గిద్దలూరుకు చెందిన కిషోర్, మౌనిక కుటుంబ సభ్యులు అహోబిలం ఆలయానికి వచ్చి తిరిగి వెళ్తుండగా గాజులపల్లె సమీపంలో బ్యాగు గల్లంతైనట్లు గుర్తించారు. అందులో 13 తులాల బంగారు నగలు ఉన్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డికి సమాచారం అందించగా మహానంది పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ జరగలేదని చెప్పారు. గిద్దలూరు వెళ్లిన తర్వాత బాధితులు గుర్తించినట్లు తమకు సమాచారం అందిందన్నారు.

అన్నదమ్ముల ఆస్తి పంచాయితీ

- అన్న టీడీపీ నేత కావడంతో పోలీసులు అతనికే వత్తాసు
- పోలీసుల వేధింపులతో రెండు రోజులుగా కనిపించని తమ్ముడు
- ఆందోళనలో కుటుంబీకులు



ఆందోళన వ్యక్తం చేస్తున్న నబీరసూల్ కుటుంబీకులు

డోన్: కుటుంబంలో నెలకొన్న ఆస్తి తగాదాలను సామరస్యంగా పరిష్కరించాల్సిన పోలీసులు రాజకీయ ఒత్తిళ్లతో ఒకరికే వత్తాసు పలకడంతో వివాదం మరింత ముదిరింది. చివరకు ఓ వ్యక్తి అదృశ్యానికి కారణమైంది. టీడీపీ నాయకులు, పోలీసులు వేధిస్తుండటంతో తన భర్త నబీ రసూల్ అదృశ్యమయ్యాడని యు. కొత్తపల్లె గ్రామానికి చెందిన షాహీన్ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. తన బావ మిన్నల్ల హుసేన్ టీడీపీ నేత కావడంతో పోలీసుల అండతో తరచూ తన భర్త నబీరసూల్‌ను వేధిస్తున్నారన్నారు. రెండు రోజులుగా తన భర్త కనిపించడం లేదని, అతనికి ఏదైనా ప్రాణహాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని టీడీపీ నాయకులు, పోలీసులను ఆమె ప్రశ్నించారు. కుటుంబ ఆస్తి వివాదంలో పోలీసులు కలుగజేసుకుని తన భర్తను వేధించడం ఎంత వరకు న్యాయమన్నారు. ఆస్తి కోసం తన భర్తను సొంత బావనే కిడ్నాప్ చేశారేమోనని అనుమానం కలుగుతుందని ఆమె ఆరోపించారు. వెంటనే తన భర్తను క్షేమంగా ఇంటికి చేర్చే విధంగా పోలీసు ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

కర్నూలు(రూరల్): కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోవచ్చని ఆర్‌డీఓ కిడారి సందీప్ కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూముల క్రమబద్ధీకరణకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఆక్రమణకు గురైన ప్రాంతాలను తహసీల్దార్ పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పరిశీలిస్తారని తెలిపారు.

ట్రాక్టర్‌తో ఢీకొట్టి.. కాలువలో పడేసి

- యూట్యూబ్ చానల్ నిర్వాహకుడి హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

గుంతకల్లు: యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు భోగాల తిరుమలరెడ్డి (42) హత్య కేసును గుంతకల్లు రూరల్ పోలీసులు ఛేదించారు. ముందుగా ట్రాక్టర్‌తో ఢీకొట్టి, అనంతరం హంద్రీ-నీవా కాలవలో పడేసినట్లు గుర్తించారు. గురువారం కసాపురం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ ఎస్.ప్రవీణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన తిరుమలరెడ్డి గుంతకల్లులోని తిలక్‌నగర్‌లో నివాసముంటున్నాడు. 'బీవీఆర్ న్యూస్ టుడే' పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహించేవాడు. గుంతకల్లు మండలం సంగాల గ్రామానికి చెందిన జీవన్ కుమార్ తన నాలుగు ఎకరాల పొలం పక్కనే ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటుండగా, ఈ విషయమై తిరుమలరెడ్డి, జీవన్‌కుమార్‌కు మధ్య వివాదం చోటుచేసుకుంది. తనకు డబ్బు ఇవ్వకుంటే కథ చూస్తానంటూ జీవన్‌కుమార్‌ను తిరుమలరెడ్డి వేధించేవాడు. దీంతో ఒప్పందం కుదుర్చుకుని కొంత డబ్బును జీవన్‌కుమార్ చెల్లించాడు. అయితే, అక్కడితో ఆగకుండా తహసీల్దార్‌కు తిరుమలరెడ్డి ఫిర్యాదు చేయడంతో జీవన్‌కుమార్ కక్ష పెంచుకున్నాడు. బోయ రామాంజినేయులు, బోయ రామన్నతో కలిసి తిరుమలరెడ్డి హత్యకు పథకం రచించాడు. ఈ నెల 17న ఉదయం తన ఇంటి నుంచి బైకుపై పొలానికి బయలుదేరిన తిరుమలరెడ్డిని కసాపురం సమీపంలోని హంద్రీ-నీవా కాలువ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా ట్రాక్టర్‌తో బలంగా ఢీకొట్టారు. దీంతో స్పృహ కోల్పోయిన తిరుమలరెడ్డిని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి హంద్రీ-నీవా కాలువలో పడేసి పరారయ్యారు. మృతుడి భార్య రామేశ్వరి ఫిర్యాదు మేరకు డీఎస్పీ ఎ.శ్రీనివాస్ నేతృత్వంలో ముమ్మరంగా విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు సీఐ వివరించారు.

సారా తయారీ మానుకోకపోతే పీడీ చట్టం



ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు, మహిళలు

కర్నూలు: సారా తయారీ, రవాణా, విక్రయాలు మానుకోకపోతే పీడీ చట్టంతో జైలుకు పంపుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావు హెచ్చరించారు. నవోదయం 2.0లో భాగంగా కర్నూలులోని బంగారుపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ నీలిషికారీలు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకోవాలన్నారు. సారా తయారీ మానుకోకపోతే అలాంటి వారి జాబితాను తయారు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, సీఐలు జయరాం నాయుడు, సుభాషిణి, చంద్రహాస్, ఎస్‌ఐ రెహనా బేగం పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న కోసిగి పోలీసులు

కోసిగి: స్థానిక రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు (65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రైల్వే ట్రాక్‌కు కొంత దూరంలో ముళ్ల పొదల మధ్య పడి ఉన్నాడు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. గుండెపోటుకు గురై మృతి చెందాడా..ఇతర కారాణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయం పోలీసులు తేల్చాల్సి ఉంది. మృతదేహాన్ని స్థానికులు గమనించి కోసిగి పోలీసులకు సమాచారం అందించగా స్థలానికి చేరుకున్నారు. స్థలం రైల్వే లైన్ పరిధిలో ఉండడంతో రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు దర్యాప్తు చేసి మృతికి కారాణాలు తేల్చాల్సి ఉంది.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	4,701	6,906
పొద్దుతిరుగుడు	5,029	5,029
ఆముదం	5,720	5,769
వాము	2,262	26,000
ఉల్లి	659	2,600
ఎండుమిర్చి	4,129	12,910
శనగలు	2,009	5,899
కందులు	2,169	7,663
మొక్కజొన్న	2,089	2,210
మినుములు	4,709	7,729
కొర్రలు	2,163	3,281
సోయాచిక్కుడు	1,463	3,909
సజ్జలు	2,211	2,211

ఫోన్ నం : 08518-257204, 257661